వాసుపల్లి ప్రభావతిని పరామర్శించిన జెవి సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర - విశాఖ : వృద్ధాప్యం వల్ల విశాఖ జాలారి పేటలోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న సిపిఐ పూర్వ జిల్లా కార్యవర్గ సభ్యురాలు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య పూర్వ జిల్లా అధ్యక్షురాలు, గౌరవాధ్యక్షురాలు కామ్రేడ్ వాసువల్లి ప్రభావతిని బుధవారం పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ జె వి సత్యనారాయణమూర్తి పరామర్శించి ఆరోగ్యం, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ, మహిళా సమాఖ్యలో ప్రభావతి చురుకుగా పని చేసేవారని ఆమెతో పనిచేసిన జ్ఞాపకాలు నెమరు వేసు కున్నారు. కామ్రేడ్ ప్రభావతిని పరామర్శించిన వారిలో పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ విమల, జిఎస్‌జె అచ్యుతరావు, సిఎన్ క్షేత్రపాల్ తదితరులు ఉన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం పెద్ద సంఖ్యలో పేదలు విశాఖ సీతమ్మధార తహసిల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎం రమేష్ కి ఎం పైడిరాజు, పాత్రపిల్లి చంద్రశేఖర్ తదితరుల ద్రువారా వ్యక్తిగత దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా హామీ అమలుకు చర్యలు తీసుకోలేదన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3.20 లక్షల కోట్ల భారీ బడ్జెట్లో ఇళ్ల స్థలాల కోసం నిధులు కేటాయించలేదని, కనీసం 10 వేల కోట్ల రూపాయలు దీనికి కేటాయించాలని, ఈ బడ్జెట్ సమావేశాల్లో దీనిపై నిర్ణయం తీసుకోవాలని, లేని పక్షంలో పేద ప్రజలను సమీకరించి పోరాటం చెయ్యడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. టిడ్కో ఇళ్ల కోసం లబ్దిదారులు 25వేలు, 35వేలు, 50వేలు, లక్ష చొప్పున కట్టారని, టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి, మౌలిక సదుపాయాలు సమకూర్చి లబ్దిదారులకు వెంటనే ఇవ్వాలని కోరారు. పేదలకు ఇవ్వడానికి భూములు లేవని చెపుతున్నారని వేల ఎకరాల భూములు కబ్జాదారుల కోరల్లో ఉన్నాయని వాటిని స్వాధీనం చేసుకొని అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గం సభ్యులు షేక్ రహమాన్, జి.ఎస్.జె. అచ్యుతరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వడాల గోవింద్ నెయ్యల నాగభూషణం, వాసపల్లి.నల్లయ్య, ఆదారి ఆదినారాయణ, ఏఐవైఎఫ్ నాయకులు ఎన్.మధురెడ్డి, ఆర్.అశోక్, అడ్డూరు శంకర్రావు, లంక గోవింద్, లక్ష్మణ్ రెడ్డి తదితరులతో పాటు ఇళ్ళు లేని పేదలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేదల గృహ నిర్మాణాల కోసం అదనపు ఆర్థిక సహాయం

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి గృహ నిర్మాణాలకు అదనపు ఆర్థిక సహాయం వివరాలు తెలిపేందుకు పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ పిఎంఎవై లో ఇల్లు మంజూరై ఇంకనూ వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న గృహాలకు అదనంగా ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ, పివిటిజి లకు గృహాలు మంజూరై ఇంకను వివిధ దశల్లో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న గృహాలను పూర్తి చేయడానికి అదనపు ఆర్థిక సహాయం అందించేందుకు అనుమతిస్తూ జిఓఆర్ టి నంబర్ 9 ద్వారా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంలో భాగంగా 2029 నాటికి 'అందరికీ ఇళ్లు' నిర్మించాలనే లక్ష్యంలో భాగంగా అసంపూర్తి నిర్మాణంలో ఉన్న గృహాలను పూర్తి చేయడానికి అదనపు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఇళ్లు మంజూరై ఇంకనూ వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న ప్రస్తుత యూనిట్ విలువ 1.80 లక్షల రూపాయలకు అదనంగా ఎస్సీలకు 50 వేలు, బీసీలకు 50 వేలు, ఎస్టీలకు 75 వేలు, పివిటీజీలకు లక్ష రూపాయలు చొప్పున అదనపు సాయం అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పి.ఎం.ఎ.వై అర్బన్, గ్రామీణ క్రింద ఒకటి, రెండు ఆప్షన్ లో 24696 గృహాలు నిర్మాణంలో ఉన్నాయని, వీటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంబంధించి 8619 మంది లబ్ధిదారులకు 43.40 కోట్ల రూపాయల అదనపు సాయం అందుతుందన్నారు. నిర్మాణం పూర్తి చేసుకునే దశల వారీగా అదనపు మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాకు నేరుగా జమ చేస్తారని చెప్పారు. జిల్లాలో మే నెలాఖరు నాటికి 7,750 గృహాలు పూర్తి చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ గృహ నిర్మాణ లబ్ధిదారులు యొక్క ఇంటి నిర్మాణ దశలను గుర్తించి అదనపు సాయం మంజూరు జరుగు తుందన్నారు. లబ్ధిదారులు కూడా ప్రభుత్వం అందిస్తున్న ఈ అదనపు ఆర్థిక లబ్ధి సదవకాశాన్ని వినియోగించుకొని సొంతింటి కల సాకారం చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని గృహ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకు నేందుకు విస్తృత ప్రచా రం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో హౌసింగ్ పి.డి సిహెచ్.సత్తిబాబు పాల్గొన్నారు.

ఈ నెల 15న జెడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు

సిఈఓ నారాయణమూర్తి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు శనివారం,15 తేదిన ఉదయం 10 గంటల నుండి చైర్ పర్సన్ జె. సుభద్ర వారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి నారాయణమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన జారీచేసారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గం.లకు స్థాయి సంఘముల సమావేశాలు ప్రారంభం అవుతాయన్నారు. ఉదయం 10 గం.లకు 2 వ మరియు 5వ స్థాయి సంఘం, మధ్యాహ్నం 11గం.లకు 3, 4వ స్థాయి సంఘాలు, మధ్యాహ్నం 12 గం.లకు 1, 6, 7వ స్థాయి సంఘ సమావేశములు నిర్వహించడం జరుగుతుందని ఆయన ఆ ప్రకటనలో వివరించారు. అధికారులందరూ తమ శాఖల ద్వారా అమలు జరుపబడుచున్న వివిధ అభివృద్ధి కార్యక్రమములపై సమగ్ర ప్రగతి నివేదికలుతో జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశమునకు స్వయంగా హాజరు కావలసినదిగా కోరడమైనది.

ఘనంగా పండిత సదస్యం

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారి గాంగధార వద్ద ఉన్న అనుబంధ దేవాలయం సీతారామ స్వామివారి ఆలయంలో పండిత సదస్యం ఘనంగా జరిగింది. సీతారామ స్వామివారి వార్షిక కళ్యాణం ఉత్సవం ఈనెల 10న జరిగిన సంగతి పాఠకులకు విదితమే. ఆ ఉత్సవాల్లో భాగంగా బుధవారం పండిత సదస్యం జరిగిందని సహాయ కార్యనిర్వహణాధికారి ఎన్ ఆనంద్ కుమార్ తెలిపారు.

వ్యవసాయ యంత్ర పరికరాల పథకం సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - ఆనందపురం : వ్యవసాయ యంత్ర పరిక రాలు రాయితీపై వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అంద జేయడం జరుగుతోందని మండల వ్యవసాయ అధికారి సంధ్యారాత్న ప్రభ తెలిపారు. ఈ పథకంలో భాగంగా బ్యాటరీ స్ప్రేయర్లు, చేతి పంపులు(మందు క్యాన్లు), పవర్స్ స్ప్రేయర్లు (పెట్రోల్ పంపులు)అదేవిధంగా ట్రాక్టర్ కు జతపరిచే పనిముట్లు లభ్యతలో ఉన్నాయి ఈ పరికరాలను రాయితీపై పొందాలనుకునేవారు ఆయా గ్రామాలలో ని సమీప రైతుసేవ కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించాలని ఈ పథకం ద్వారా ఒక రైతుకి ఒక పరికరం మాత్రమే నన్ను చేస్తారని, ఈ నేపథ్యంలో తమకు అవసరమైన పరికరాన్ని రైతులు ఎంపిక చేసుకోవాలి. ఇందుకోసం పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్,ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు సమర్పించాలి. ఆధార్ తో అనుసంధానమైన ఫోన్ నెంబర్ ను ఇవ్వాలి. గత మూడు ఏళ్లలో ఈ పంటలో నమోదు కావడంతోపాటు భూసార పరీక్ష కార్డు ఒక ఏదాది అయినా నకలు సమర్పించాలి. ఎస్సి, ఎస్టి వర్గాలకు చెందినవారైతే సంబంధిత కుల ధ్రువీకరణ పత్రం అందజేయాలి. ఆయా వివరాలతో సిబ్బంది ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సిహెచ్. సంధ్య రత్నం ప్రభ తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనందపురం సబ్ స్టేషన్ మరమ్మత్తులు నిమిత్తం గురు వారం ఉదయం 8.00 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని ఏఈ సురేష్ కుమార్ తెలిపారు . ఈ సందర్భంగా గిడిజాల, బాకురుపాలెం, మిందివాని పాలెం, గుమ్మడి వాని పాలెంతదితర ప్రాంతాలలో గృహ, వ్యవసాయ, పారిశ్రమీక వినియోగదారులు గమనించాలని తెలిపారు.

విశాలాక్షి నగర్‌లో భారీ అక్రమ నిర్మాణం

విశాలాంధ్ర - పిఎంపాలెం : విశాఖ నగరంలో జీవీఎంసీ పరిధిలో భారీ అక్రమ నిర్మాణాలు ఏదేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయి. నియంత్రించే జీవీఎంసీ కమిషనర్ లేకపోవడంతో ప్రజా ప్రతినిధులు దళారులుగా మారి, అధికారులకు ముడుపులు అప్పగించి, దర్జాగా అక్రమ నిర్మాణాలు అనధికార అంతస్తులు నిర్మించి రెండు చేతుల సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా టిడిఆర్ పేరుతో భారీ అక్రమ నిర్మాణం చేపట్టిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడ్డం లేదు. అదనపు అంతస్తు నిర్మాణంతోపాటు నిబంధనలకు విరోధంగా సెల్లార్ నిర్మాణం గ్రౌండ్ ఫ్లోర్ లో కమర్షియల్ మెట్ల నిర్మాణం సాగుతుందని స్థానికులంతా పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారు. జీవీఎంసీలో ఓ ప్రజాప్రతినిధి సిఫారసు చేయడంతో అధికారులు తలో పిడికెడు ముడుపులు తీసుకుని వదిలేశారు. జోన్ 2 పరిధిలో హనుమంతు వాక జంక్షన్ విశాలాక్షి నగర్ వైపు రహదారి ఆనుకొని భారీ అపార్ట్మెంట్ నిర్మాణం నిబంధనలు ఉల్లంఘించి నిర్మిస్తున్నారు. ఆపై కమర్షియల్ కాంప్లెక్స్ సైతం నిర్మాణానికి సిద్ధమయ్యారు. కనీసం షడ్ బాక్స్ కూడా పాటించలేదు ఈ నిర్మాణంలో, బిపి నెంబర్ 1086/5337/బి / జెడ్ 2//2021 గల నిర్మాణంకు అనుమతి తీసుకున్నారు.

చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేష్టలకు ప్రజలే బుద్ధి చెబుతారు

దక్షిణ నియోజకవర్గంలో ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : వెన్నుపోటు చంద్రబాబు, రాజకీయ వికలాంగుడు పవన్ కళ్యాణ్ పిచ్చి చేష్టలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పూర్తిగా అంధకారంలోకి వెళ్ళిపోతుందని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆరోపించారు. విశాఖపట్నం జిల్లా దక్షిణ నియోజకవర్గంలో గల 29వ వార్డు జగదాంబ జంక్షన్ వైయస్సార్ విగ్రహం వద్ద వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకులు ఘనంగా జరిగాయి. ముందుగా మాజీ ఎమ్మెల్యే, దక్షణ నియోజకవర్గ సమన్వయ కర్త వాసుపల్లి గణేష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్ కుమార్, వైసీపీ సీనియర్ నాయకులు ద్రోణంరాజు శ్రీ వాత్సవ్, జాన్ వెస్లీ, కొండా రాజీవ్ గాంధీ వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం 29వ వార్డు వైసీపీ అధ్యక్షుడు పీతల వాసు యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. అనంతరం మహిళలకు పేద చీరల పంపిణీ చేశారు. అనంతరం వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ 14 ఏళ్ల లో వైయస్సార్సీపి ప్రజల తరపున ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. ఐదేళ్ల ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు రామరాజ్యాన్ని అందించిన చరిత్ర వైసీపీ ది మాత్రమేనన్నారు. వైసిపి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఒంటరిగా పార్టీని స్థాపించి ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయే సంక్షేమ నందించారన్నారు. జత కట్టకపోతే ఎమ్మెల్యే కూడా అవ్వలేని పవన్ కళ్యాణ్, కుటిల రాజకీయాల చేసే చంద్రబాబు నేడు పచ్చి అబద్ధాలతో జగన్మోహన్ రెడ్డిని, ప్రశ్నించే వైసిపి శ్రేణులపై కక్ష సాధింపు చర్యలు చేయడం దుర్మార్గమన్నారు. నిజంగా దమ్ముంటే జగన్మోహన్ రెడ్డిలా ఇచ్చిన హామీలను, యువతకు రైతుకు మహిళలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నింటినీ అమలు చేసి మాట్లాడాలని హితవు పలికారు. నేడు "యువత పోరు" కార్యక్రమం అన్ని జిల్లాల హెడ్ క్వార్టర్స్ లో విజయవంతంగా జరిగిందన్నారు. రూ.3000 నిరుద్యోగ భృతి, యువతకి ఉద్యోగ అవకాశాలుతో పాటు, జగన్మోహన్ రెడ్డి హయాంలో జరిగిన 17 మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనివక్షంలో నిరుద్యోగ యువత ఆగ్రహానికి కూటమి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, సౌత్ వార్డు ప్రెసిడెంట్స్, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సౌత్ వైఎస్ఆర్సీపీ నాయకులు మరియు మహిళా నాయకులు పాల్గొన్నారు.

జూన్ లోపు టిడ్కో గృహాలకు మౌలిక వసతులు కల్పిస్తాం

విశాలాంధ్ర - పెదగంట్యాడ : గాజువాక నియోజక వర్గ పరిధిలోని బానోజీ తోట, పెద గంట్యాడలో గల టిడ్కో గృహాలకు జూన్‌లోగా మౌలిక వసతులు కల్పి స్తామని టిడ్కో ఈఈ సుధాకర్ వెల్లడించారు. బుధ వారం టిడ్కో అధికారులు, టాటా ప్రాజెక్టు అధికారులు టిడ్కో గృహ సముదాయాలు పరిశీలించారు. అనంతరం టిడ్కో గృహ లబ్ధిదారులతో మాట్లాడారు. సిపిఐ ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమానికి సిపిఐ గాజువాక నియోజక వర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్య నారాయణ అధ్యక్షత వహించారు. టిడ్కో గృహాలలో నెల కొన్న సమస్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ టిడ్కో గృహాలకు తక్షణమే మౌలిక వసతులుకల్పించాలని అన్నారు. సిపిఐ విజ్ఞప్తికి స్పందించిన అధికారులు వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. టిడ్కో గృహ లబ్ధిదారుల సమస్యల పరిష్కారం లో వెంటనే చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఈ. రాజేష్, టాటా ప్రాజెక్టు ఇన్చార్జి ఏ.శ్రీనివాస్‌రావు. మేనేజర్ రాజ బాబు, సిపిఐ నాయకులు జి.ఆనంద్, టిడ్కో లబ్ధి దారులు పి. అప్పల రాజు, భాస్కర్‌రావు, ఖాన్, రహీనా, కృష్ణా రావు, రమా దేవి, తిరుపతిరావు, రమేష్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియను మెరుగుపరిచేందుకు తగిన సూచనలు ఇవ్వండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : ఈఆర్వో, డీఈవో, సీఈవో స్థాయిలో పరిష్కారంకాని ఏవైనా సమస్యలపై భారత ఎన్నికల సంఘానికి నేరుగా సూచనలు ఇవ్వొచ్చని, ఈ మేరకు జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలకు ఆహ్వానం తెలుపుతూ ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించిందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ 30, 2025 నాటికి అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలు సూచనలను అందజేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. చట్టానికి అనుగుణంగా ఎన్నికల ప్రక్రియలను మరింత బలోపేతం చేయడానికి, పరస్పరం అనుకూలమైన సమయంలో పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ సభ్యులతో చర్చించేందుకు కూడా యోచిస్తోందని వెల్లడించారు. వివిధ స్థాయిల్లో పెండింగ్ సమస్యలనూ తమ దృష్టికి తీసుకురావాలని కోరినట్లు గుర్తు చేశారు. రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సంభాషణలు నిర్వహించాలని, అటువంటి సమావేశాలలో వచ్చిన ఏవైనా సూచనలను ఇప్పటికే అమలులో ఉన్న చట్టపరమైన నిబంధనలకు లోబడి కచ్చితంగా పరిష్కరించాలని, మార్చి 31, 2025 నాటికి తీసుకున్న చర్యలపై ఎన్నికల సంఘానికి నివేదికను సమర్పించాలని గత వారం జరిగిన ఈసీఐ సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల సీఈవోలు, డీఈవోలు, ఈఆర్వోలను ఆదేశించినట్లు కలెక్టర్ వివరించారు. ఈఐసీ కల్పించిన ఈ అవకాశాన్ని ముందస్తుగా ఉపయోగించుకోవాలని రాజకీయ పార్టీలను ఈ సందర్భంగా కోరిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో దోహదపడే వివిధ చట్టాల భాగస్వామ్యాన్ని, ఆవశ్యకతలను కూడా రాజకీయ పార్టీలకు రాసిన లేఖలో ప్రస్తావించినట్లు వివరించారు.

కూటమి ప్రభుత్వంలో రోడ్డు పనులు జోరు...

15 లక్షలు రూపాయలతో పనులకు మోక్షం

శోంత్యాం గ్రామంలో 35 సంవత్సరాల తర్వాత రోడ్డు

విశాలాంధ్ర - ఆనందపురం : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించింది . ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థ 1990-1991 సంవత్సరంలో ఆనంద పురం మండలం సొంత్యము గ్రామంలో ఎస్సీ బీసీ కాలనీలో సుమారు 35 సంవత్సరాల తర్వాత 15 లక్షల రూపా యలతో రోడ్డు పనులు ప్రారంభించడం పట్ల స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీకి, ముఖ్యమంత్రి చంద్రబాబు కి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే భీమిలి శాసనసభ్యులు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, జనసేన పార్టీ భీమిలి ఇంచార్జ్ సందీప్ గ్రామంలో సిసి రోడ్డు పనులు పూర్తి చేయడం జరిగిందని ఈ సందర్భంగా స్థానిక నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ బొద్దాపు పోలి నాయుడు, జనసేన మండల ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి, మాజీ ఎంపీటీసీ అచ్చిబాబు, బొద్దాపు గోవింద్, వెంకట్రావు, కోరాడ శ్రీను, ముసలి నాయుడు, రాంబాబు, శంకర్, రాము, కనకరాజు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ రంగంలో నైపుణ్యత సంపాదించాలి

సైబర్ సెక్యూరిటీ సదస్సులో నగర పోలీస్ కమిషనర్

విశాలాంధ్ర - విశాఖపట్నం : యువతరం సైబర్ నేరాలను నియంత్రించే నిపుణులుగా తయారు కావాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రతా బగ్చి అన్నారు. ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం, నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ సంయుక్తంగా నిర్వహించిన ఐదు రోజుల బూట్ క్యాంప్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సహకారంతో నిర్వహిస్తున్న ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ (ఐ ఎస్ ఈ ఏ) ప్రాజెక్ట్ - 3 లో భాగంగా ఐదు రోజుల బూట్ క్యాంపును సైబర్ సెక్యూరిటీ, ప్రైవసీ, క్రిప్టోగ్రఫీ వెబ్ అప్లికేషన్ పెనట్రేషన్ టెస్టింగ్ అంశంపై నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రశ్నించడం మొదలు పెడితేనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడుతుందని చెప్పారు. సైబర్ దాడులు, సైబర్ నేరాలు అనేక దేశాలను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న విధానాన్ని వివరించారు. వ్యవస్థలో లోపాలను తమకు అనుకూలంగా మార్చుకొని సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడుతున్న విధానాన్ని వివరించారు. యువత సైబర్ సెక్యూరిటీ రంగంలో నిష్ణాతులుగా మారడానికి అవసరమైన కోర్సులను చేయాలని, తమ సామర్థ్యాలను నిరంతరం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఏయు ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ తరగతి గదిలో నేర్చుకున్న దానికి భిన్నంగా బూట్ క్యాంపులో నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని చెప్పారు. పోలీస్ శాఖ నేడు అనేక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటోందని అన్నారు. సదస్సు సమన్వయకర్త ఆచార్య వి. వల్లి కుమారి మాట్లాడుతూ ఐదు రోజుల బూట్ క్యాంపుకు 56 మంది పాల్గొన్నారని, వీరికి నాలుగు అంశాలపై సమస్యలను ఇచ్చి పరిష్కరించే విధంగా వారిని సన్నద్ధం చేశామని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ సైబర్ నిపుణులను తయారు చేయడం, విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ పై శిక్షణ అందించడం, ప్రజల్లో అవగాహన కలిగించడం ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు మాట్లాడుతూ సైబర్ సవాళ్లకు ప్రతి వ్యక్తి సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగ ఆచార్యులు ఆచార్య ఎం.శశి, ఆచార్య జి.లావణ్య దేవి తదితరులు ప్రసంగించారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జగన్ పెట్టిన ఇబ్బందులను కూటమి ప్రభుత్వం తీరుస్తుంది

టీడీపీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి

విశాలాంధ్ర - విశాఖ సిటీ : విద్యార్థులకు జగన్ పెట్టిన ఇబ్బందులను ఇప్పుడు కూటమి ప్రభుత్వం తీరుస్తున్నదని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, జిల్లా టిడిపి అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతు జగన్ పెట్టిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను కూటమి ప్రభుత్వం తీర్చుతుంది అని అన్నారు. ఫీజ్ రియంబర్స్మెంట్ ప్రక్రియను వైసీపీ అస్తవ్యస్తం చేసిందని, గత వైసీపీ ప్రభుత్వంలో ఫీజు రియంబర్స్మెంట్ అందకపోవటంతో10 లక్షలు మంది విద్యార్థులు ఇబ్బందులుపడ్డారు అని చెప్పారు. విద్యార్థులను మోసం చేసి వైసీపీ యువత పోరు అని అంటుంది అని ఎద్దేవా చేశారు. కళాశాల యాజమాన్యాలను బెదిరించి విద్యార్థులను తీసుకువచ్చి ఎండలో నిలబెట్టేవారని అన్నారు. 4 వేల కోట్లు జగన్ బకాయిలు పెట్టి వెళ్లిపోయారని, ఏడు లక్షల మంది పేద విద్యార్థులను జగన్ మోసం చేస్తే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 789 కోట్లు విడుదల చేసింది అని తెలిపారు. గత ప్రభుత్వంలో ఫీజ్ రియంబర్స్ మెంట్ డబ్బులు అందక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు అని గుర్తు చేశారు. జగన్ చేసిన అప్పులు రాష్ట్ర ప్రభుత్వం 70 వేల కోట్లు వడ్డీలు కడుతుంది. ఇప్పుడు రాష్ట్రంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ప్రభుత్వానికి సమయం ఇవ్వకుండా వైసీపీ నాయకులు పోరు అంటున్నారు. నాడు నేడు లో ఎన్ని పాఠశాలలు అభివృద్ధి చేశారో వైసీపీ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలు జగన్ కు తగిన బుద్ధి చూపినా మార్పు రావడం లేదని అన్నారు. జగన్‌కు మీడియా పై, నాయకులు పైన గౌరవం లేదని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని అభివృద్ధి, సంక్షేమంకు ఉపయోగించుకుంటామని చెప్పారు.తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు అని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గొంపా సత్యనారాయణ, ఉత్తర నియోజకవర్గం టిడిపి నాయకులు వెల్లంకి భరత్ పాల్గొన్నారు.

ఉత్తర నియోజకవర్గంలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : విశాఖ ఉత్తర నియోజకవర్గంలో కె.కె రాజు ఆధ్వర్యంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం నిర్వహించారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు ఆధ్వర్యంలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 55 వార్డు ధర్మానగర్లో గల దివంగత వై.యస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి కె.కె రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలన అందించిన దివంగత వై.యస్ రాజశేఖర రెడ్డి మరణం అనంతరం ఆయన ఆశ యాలను కొనసా గించాలని సదుద్దే శంతో వై.యస్ జగన్మోహన్ రెడ్డి పార్టీని స్థాపించి ఓదార్పు యాత్ర , ప్రజాసంకల్ప యాత్ర ద్వారా ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని ప్రజల ఆశీస్సులతో అత్యధిక మెజారిటీతో పార్టీని గెలిపించి ముఖ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి ప్రజల ఆశించిన విధంగా అనేక సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించి అండగా నిలిచార న్నారు. వివిధ కార ణాలతో ఇప్పుడు అధికారం కోల్పోయినప్పటికి సుమారు 40 శాతం ఓటర్లు పార్టీని విశ్వసించి ఓట్లు వేశారని, మళ్ళీ వచ్చేది మన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని అన్నారు. అప్పటివరకు ప్రజలకు మన పార్టీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉండాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్,ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్ కె.అనిల్ కుమార్ రాజు,కో-ఆప్షన్ మెంబర్ సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు గుజ్జు వెంకట రెడ్డి, పైడి రమణ, పీలా వెంకటలక్ష్మి,మాజీ డైరెక్టర్లు, జిల్లా కమిటీ నాయకులు,అనుబంధ సంఘాల అధ్యక్షులు సభ్యులు, బూత్ కన్వీనర్లు సభ్యులు, మహిళలు, యువకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువత నిరసన పోరులో....

విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ చంద్రబాబు సర్కార్ పై యువత పోరు నిరసన కార్యక్రమం జిల్లా పరిషత్ జంక్షన్ వద్ద గల కృష్ణ మందిరం నుండి పాదయాత్రగా విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంనకు వెళ్లి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్, మాజీ మంత్రివర్యులు కురసాల కన్నబాబు జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్, ఇతర ప్రజా ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులతో కలిసి పాల్గొన్న విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
M.V.O.P. 453/2023

Between:
Seela Dhanalakshmi .. Petitioner
A n d :
1. Inti Charan Kumar
2. Rapaka Jack Herbert
3. Go Digit General Insurance Ltd.
.. Respondents

NOTICE

To
2nd Respondent : **Rapaka Jack Herbert**, S/o Dyva Vara Prasad, Hindu, aged 22 years, Owner of Vehicle No.AP 39 QC 3016, Previously R/o of D.No.3-71/1, Rajiv Nagar, K.S.Gattu, Attili, West Godavari District, PIN:534134 and presently residing in Visakhapatnam District.

Please take notice that the above named petitioner has filed the above case against you and the same stands posted to **08-04-2025** for your appearance in the court. On that day, you attend either personally or through an Advocate before the above said court at 10.30 a.m. failing which the matter will be decided exparte in your absence.

(By Order of the Honorable Court).

BOYINA RAMAKRISHNA RAO, ADVOCATE, VISAKHAPATNAM, PH.888 53 77 888.

ప్రభుత్వాధీనంలో వైద్యరంగం ప్రజలకు రక్షణ

పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకట్రావు

విశాలాంధ్ర - పెందుర్తి : వైద్యరంగం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని లేకుంటే ప్రజల ఆరోగ్యానికి రక్షణ ఉండదని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఓబిసి డిపార్ట్మెంట్ ఇంచార్జ్ మూల వెంకట్రావు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పుతున్న నూతన వైద్య కళాశాలలకు ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) నమూనాను వర్తింపజేయడం ఇప్పటికే మినుకు మినుకు మంటున్న ప్రజారోగ్యాన్ని మరింత చీకటిమయం చేయడమేనని స్పష్టం చేశారు. గతప్రభుత్వం వైద్య విద్యార్థుల భవిష్యత్తును పెనం మీదికినెట్టగా ప్రస్తుత ప్రభుత్వం ఏకంగా పొయ్యిలోనికి తోసినట్లుగా ఉందని ఆక్షేపించారు. రాష్ట్రప్రజలకు నాణ్యమైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వ రంగంలో వైద్య విద్య సౌకర్యాలు పెరగాలన్నారు. ప్రైవేట్ కాలేజీలలో సీట్లు కొనలేక వైద్య విద్యపై ఆసక్తి ఉన్న చాలామంది ఔత్సాహిక యువత తమ ఆలోచనను విరమించుకుంటున్నారని పేర్కొన్నారు. కొత్తగా వచ్చే మెడికల్ కాలేజీలు ప్రభుత్వరంగంలో నెలకొల్పుతారని విద్యర్థులు ఎంతగానో ఆశ పడ్డారని, కానీ పి-3' మోడల్ అని ప్రభుత్వం ప్రకటించి వారి ఆశలను అడియాశలు చేసిందన్నారు. కూటమి సర్కారు ప్రకటించిన" స్వర్ణాంధ్ర విజన్-2047 నినాదం ఐశ్వర్య, ఆరోగ్యం,ఆనంద రాష్ట్రాన్ని నిర్మించడం. ప్రజలందరూ ఆరోగ్యవంతులు కావాలంటే వైద్యరంగం పూర్తిగా ప్రభుత్వ ఆదినంలోనే ఉండాలన్నారు. ప్రతి వెయ్యిమందికి ఒక డాక్టరు ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిందని, నగరాలు, పట్టణాల్లో ఆ నిష్పత్తిలో వైద్యులుండ వచ్చునేమోకానీ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు చాలా అధమస్థాయిలో ఉన్నాయన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో తరుచూ కనిపించే డోలీ మోతలే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. ఆరోగ్యంప్రజల హక్కు అది సాకారం కావాలంటే ప్రభుత్వరంగంలో వైద్యసదు పాయాలు పరిపుష్టం కావాలని, ప్రభుత్వ రంగంలోనేవైద్యకాలేజీలు, ఆసుపత్రులు కొన సాగాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. పి -3, పి-4 నమూనాలతో మితిమీరిన ఖర్చులు పెరిగి పేద ప్రజల మూలుగు పీలుస్తాయని, కావున ముఖ్య మంత్రి, వైద్యశాఖ మంత్రి దీనిపై మరొక్కసారి పునరాలోచన చేయాలని రాష్ట్ర ప్రజల తరపున ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నట్లు మూల వెంకటరావు తెలియజేశారు.

ముదపాక వీవోప ఎంపిక వాయిదా

విశాలాంధ్ర - పెందుర్తి : మండలంలోని ముదపాక మహిళా సంఘాల సహాయకు రాలు (వివోఏ) ఎంపిక కార్యక్రమం వాయిదా పడింది. వివోఏ ఎంపిక కోసం వెలుగు ఏపీఎం ఎస్తేరు రాణి, జిల్లా అధికారి ప్రభాకర్ ఆ గ్రామానికి చెందిన మహిళా సంఘాల అధ్యక్షులతో బుధవారం సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశానికి 23 మంది అధ్యక్షులు హాజరు కాగా వారితో సమీక్ష నిర్వ హించిన వెలుగు అధికారులు విఓఏ నియా మకంపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా గతంలో వివోఏగా పనిచేసిన వరలక్ష్మీపై కొందరు తప్పుడు ఫిర్యాదులు చేశారని వాటిపై సమగ్ర దర్యాప్తు చేసిన తరువాత విఓఏ ఎంపిక ప్రక్రియ చేప ట్టాలని మెజారిటీ సభ్యులు అధికారులకు విన్నవించారు. దీంతో సభ్యుల అభిప్రాయాలను రికార్డ్ చేసిన అధికారులు నివేదికను పీడీకి సమర్పిస్తామని మరో రోజు వివోఏ ఎన్నిక నిర్వహిస్తామని వెల్లడించారు.

ఐమాక్స్ లైట్లు ప్రారంభించిన కార్పొరేటర్

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని ద్రోణంరాజు నగర్ కాలనీ, సింహాద్రి నగర్ కాలనీ, కుమ్మరి కాలనీలలో నూతనంగా ఏర్పాటుచేసిన ఐమాక్స్ లైట్లను స్థానిక కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి అవగడ్డ అప్పలనాయుడు, నాయకులు సేనాపతి కృష్ణమూర్తి, ఆయా కాలనీల పెద్దలు ప్రజలు మహిళలు పాల్గొని హర్షం వెలిబుచ్చారు.

దేవదాయశాఖ శాఖ మంత్రి ఆనంకు కృతజ్ఞతలు తెలిపిన పాశర్ల

విశాలాంధ్ర - సింహాచలం : గ్రేటర్ విశాఖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రాంనారాయణరెడ్డి ని అడవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్ పంచగ్రామాలలో గృహనిర్మాణధారులకు న్యాయం చేస్తు న్నందుకు కృతజ్ఞతలు తెలియజేసారు. అదే విధంగా 86 శాతం సమస్యతో ఉన్న పంచగ్రామాల రైతులకు ఖాళీస్థల యజమానులకు హక్కులు కల్పించమని కోరారు. సింహాచల దేవస్థానానికి ప్రస్తుతం ఇస్తున్న 5 వేల కోట్లు విలువైన భూమితో పాటు, గతంలో ఇచ్చిన ప్రభుత్వ భూమి ఐన అడవివరం సెర్వే నెంబర్ 275 లోగల 5280 ఎకరాల భూమి విలువ (సుమారు గా 20 వేల కోట్లు) ను కూడా పరిగణలోకి తీసుకొని పంచ గ్రామాల్లో గల రైతులకు, ఖాళీస్థలం యజమానులకు న్యాయం చేయవలసింది గా కోరారు.తక్షణమే స్పందించిన మంత్రివర్యులు అన్ని విషయాలను పరిగణంలోకి తీసుకొని ముందుగా మొదటి దశలో గృహ నిర్మాణధారులకు న్యాయం చేస్తాం అని అలాగే రెండవ దశలో రైతులకు న్యాయం చేస్తాం అని తెలియజేసారు.ఇదే విషయమై లిభీమిలి ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు కోరారని తెలియజేసారు. మంత్రివర్యులను కలిసిన వారిలో లండ రాంబాబు, భోగాపురపు పైడిరాజు పాల్గొన్నారు.

చైతన్య నగర్‌లో ఐద్వా వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి : ఐద్వా వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం చైతన్య నగర్ లో ఐద్వా సీనియర్ నాయకులు దేముడమ్మ, పార్వతి ఐద్వా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి. పద్మ, జిల్లా నాయకురాలు బి. రమణి మాట్లాడుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆంధ్రప్రదేశ్ లో 1936లో ఏర్పడిందని, అన్ని రాష్ట్రాలకు విస్తరించి 1981 మార్చి 12న ఐద్వా గా ఆవిర్భవించిందని తెలిపారు. మహిళల హక్కుల కోసం పోరాడటం, లింగ సమానత్వం సాధించటం, మహిళలపై హింసకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపించడం లక్ష్యాలుగా ఐద్వా పని చేస్తుందని, మహిళల విద్య, ఉద్యోగం,ఆరోగ్యం హక్కులు రాజకీయ ప్రాతినిధ్యం మొదలైన అంశాలపై ఉద్యమాలు నడిపిస్తుందన్నారు. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు అన్ని రాష్ట్రాలలో ఐద్వా దేశవ్యాప్తంగా కోటిన్నర సభ్యత్వంతో విస్తరించి ఉందని, చట్టసభల్లో 33 శాతం మహిళ రిజర్వేషన్ బిల్లు వెంటనే అమలు చేయాలని, మహిళలపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా, గృహం చట్టం అమలు కోసం ఉద్యమాలు చేస్తుందన్నారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్, మాతృ సంరక్షణ హక్కుల కోసం, మహిళా సాధికారత కోసం ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయపరమైన అన్ని రంగాల్లో పోరాటాలు చేస్తుందన్నారు. సమాజంలో ఉన్న అన్ని వర్గాల మహిళలను ఐక్యం చేసి సమాజాన్ని మార్చే దిశగా ఉద్యమాలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ అధ్యక్షులు వెంకట లక్ష్మి, సత్యవతి, రమణమ్మ,సరోజినీ,సూరిదమ్మ తదితరులు పాల్గొన్నారు

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఎంజీఆర్

- నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలు నిర్మాణం,మరమ్మతులు చేపట్టాలని వినతి
- నియోజకవర్గంలో అంగన్వాడీ, మినీ అంగన్వాడీలకు శాశ్వత భవనాలను ఏర్పాటు చేయాలని విన్నపం



విశాలాంధ్ర - హిరమండలం/పాతపట్నం : బుధవారం పాతపట్నం నియోజకవర్గంలోని వర్షాధార ప్రాంతాలలో వ్యవసాయానికి అనువుగా అవసరమైన చోట ఎత్తిపోతల పథకాలను మంజూరు చేయాలని అలాగే గతంలో నిర్మితమై రిపేర్ లో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ని అసెంబ్లీ సెంటర్ హాల్లోపాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు కలిసి వినతి పత్రం ను అందజేశారు. అలాగే పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో ఐసిడిఎస్ భవనంతో పాటు నియోజక వర్గంలోని అంగన్వాడీ, మినీ అంగన్వాడీలకు శాశ్వత భవనాలు నిర్మాణం కొరకు చర్యలు చేపట్టాలనిఎమ్మెల్యే ఎం జి ఆర్ విన్నవించారు.

పాఠశాల ప్రహరీ గోడకు హైస్కూల్ పీఎం శ్రీ పనులు అడ్డుకున్న గ్రామస్తులు

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనందపురం హైస్కూల్ పడిపోయిన ప్రహరీ గోడను ఏర్పాటు చేసి నీరు పోయే కాలువను పూడ్చాలని గ్రామస్తులు పేర్కొన్నారు. బుధవారం హై స్కూల్ పీఎం శ్రీ కింద మంజూరైన నిధుల పనులను పిఈటి ప్రసాద్ ఆధ్వర్యంలో చేపడుతున్నారు మైదానాన్ని చదును చేసే ప్రక్రియలో హైస్కూల్ తూర్పు పక్కన ఉన్న కాలువను పూడ్చి పనులను చేపడుతున్నారు. ఈ మేరకు సమీపంలో ఉన్న కాలనీవాసులు ముందుగా ప్రహరీ ఏర్పాటు చేసి అనంతరం కాలువను పూడ్చాలని ఉపాధ్యాయులను నిలదీశారు. ప్రహరీ ఏర్పాటు చేయకపోవడంతో వర్షపు నీరు నేరుగా కోలనీలోకి ప్రవహించి ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని ముందుగా ప్రహరీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు ప్రసాద్ పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపడతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

ప్రహరీ ఏర్పాటులో నిర్లక్ష్యం

ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హైస్కూల్ ప్రహరీ గత వర్షాకాలంలో శిథిలమై పడిపోయింది. అప్పట్లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాఠశాలను పరిశీలించి మరమ్మత్తులు చేస్తామని హామీ ఇచ్చారు. నేటికీ మరమ్మత్తులు చేపట్టలేదు సరికదా, శిథిలాలను కూడా తొలగించలేదు. ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళ హైస్కూల్లోకి ఇతరులు ప్రవేశించి అసాంఘిక కార్యక్రమాలకు నిలియంగా మారుతుంది. హైస్కూల్ ప్రహరీ పక్కన ఉన్న ఇళ్లల్లోకి రాత్రి వేళల్లో విష సర్పాలు వస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. శిథిలాలు తొలగించకపోవడంతో వర్షపు నీరు పోవడానికి వీలు లేకుండా పోయింది. దీని కోసం హైస్కూలు మైదానం తూర్పు పక్కన పెద్ద కాలువను తీసి నీరు పోవడానికి తాత్కాలిక కాలువ ఏర్పాటుచేశారు. వర్షం పడితే తాత్కాలిక కాలువ ద్వారా నీరు పోతున్నప్పటికీ ఆ మైదానం వర్షాల వల్ల తరచూ కోతకు గురవుతుంది వెంటనే నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నియోజకవర్గంలో ధాన్యం అదనపు కొనుగోలకు పచ్చజెండా

విశాలాంధ్ర - పొందూరు : ఆమదాలవలస నియోజకవర్గంలో లక్ష టన్నుల అదనపు దాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ధాన్యం కొనుగోలుకు అధికారులు చర్యలు చేపడు తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తవడంతో అధికారులు ధాన్యం కొనుగోలుకు చేతులెత్తేసారు. రైతులు కళ్ళాల్లో ధాన్యం నిలువలు పేరుకుపోవడంతో టీడీపీ నాయకులు, రైతులు ఎంఎల్సీ రవికుమార్ దృష్టికి తీసుకువెళ్ళారు. దీనిపై రవికుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళారు. దీంతో అదనపు దాన్యం కొనుగోలుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు ఆదేశాలు రావడంతో పొం దూరు మండలంలో 35 వేల టన్నులు, ఆముదాలవలస మండలంలో 25 వేల టన్నులు' బూర్జ మండలంలో 25 వేల టన్నులు, సరుబుజ్జిలి మండలంలో 15 వేల టన్నుల అదన పు దాన్యం కొనుగోలు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రవికుమార్ చొరవతో అదనపు దాన్యం కొనుగోలు ప్రభుత్వం ముందుకురావడంతో రైతులు రవికుమార్కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. రైతుల వద్ద ఉన్న చివరిదాన్యంగింజవరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులను, మద్యవర్తులను నమ్మి మోసపోవద్దని కోరారు.

సెక్రటరీలకు పనిభారం కొద్దిగా తగ్గించండి : సెక్రటరీల అధ్యక్షులు శేఖర్

విశాలాంధ్ర - హిరమండలం : మండలం లో పని చేస్తున్న పంచాయతీ కార్య దర్శులకు పని ఒత్తిడి తగ్గిం చాలని మండల సెక్రటరీల అధ్యక్షులుబూడిద శేఖర్ ఎంపీడీఓకార్యాలయంలో ఎంపీడీఓ ఆర్ కాళీ ప్రసాద్ రావును బుధవారంవినతి పత్రం ద్వారా కోరారు. ఈ సందర్భంగాపంచాయతీ సెక్రటరీ లుమాట్లాడు చూ ఒక వైపు పంచాయతీ పరిపాలన ఇంకోవైపు సచివాలయపనులు సర్వే లు మరియు మీటింగ్ లు వలన పంచాయతీ కార్యదర్శులు ము తీవ్ర పని ఒత్తిడి కి గురి అవుతున్నామని సెలవు రోజుల్లో కూడా సర్వే ల పేరుతొ కుటుంబం తో గడపకుండా చేస్తున్నారని దీని వలన అనారోగ్యపాలుకు గురి ఆవు చున్నామని కొద్దిగా పని భారం తగ్గించాలని ఎంపీడీఓ ను కోరారు.

జోనంకి అభయాంజనేయ స్వామి ఘనంగా పదో వార్షికోత్సవం

విశాలాంధ్ర - జలుమూరు : జలమూరు మండలం జోనంకి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి పదవ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది తెల్లవారి గణపతి పూజతో ప్రారంభమై అనే గ్రామాలను వచ్చిన భక్తులతో బుధవారం ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వలు ప్రాంతాల్లో వందల సంఖ్యలో భక్తులు పాల్గొని సేకరించారు అనంతరం రాత్రి స్వామివారి చక్ర తీర్థ స్నానం జరిగింది సాయంత్రం గంగాధరపేట గ్రామానికి చెందిన వలువురు మహిళలు పాడిన భక్తి గేయాలు భక్తులుకు ఆకట్టుకున్నాయి మారుమూల ప్రాంతంలో మహిళల్లో దైవ కార్యక్రమం పై ఇటువంటి పట్టుదల ఉండడం పలువురు అభినందించారు.

హౌసింగ్ లబ్ధిదారులకు ప్రభుత్వ రాయితీ

విశాలాంధ్ర - ఆనందపురం : హౌసింగ్ లబ్ధిదారులకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని మండల స్పెషల్ అధికారి, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ సత్తిబాబు పేర్కొన్నారు. బుధవారం ఆనందపురం మండలం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ హౌసింగ్ సైట్లను పరిశీలించారు ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇల్లులు పూర్తికానివారు ఎస్సీలకు 50,000 అదనంగాను ఎస్టీలకు 75,000 బీసీలకు 50,000 పర్వత ప్రాంతపు షెడ్యూల్ కులాల చెందినవారు లక్ష రూపాయలు చొప్పున అదనపు రాయితీపై అందిస్తుందన్నారు. వీటితో మిగిలిపోయిన హౌసింగ్ లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. వీటి పై సచివాలయం పరిధిలో సర్వేలు జరుగుతు న్నాయని సర్వే అనంతరం నిధులు మంజూరై వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. ఆనందపురం హౌసింగ్ ఏఈ శ్యాంసుందర్ మాట్లాడుతూ మండలంలోని 2519 ఇల్లులుగాను 1216 ఇల్లులు పూర్తయ్యాయని ఇంకా సుమారుగా 1300 ఇల్లులు వివిధ దశల్లో ఉన్నాయని వీరందరూ ఈ రాయితీకి అర్హులు అన్నారు .ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ వి జానకి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఇఓపిఆర్డి సత్యనారాయణ హౌసింగ్ ఏఈ శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

వండర్ లాబ్స్ ఆధ్వర్యంలో చర్మ సంరక్షణ అవగాహన శిబిరం

విశాలాంధ్ర - విశాఖపట్నం : వండర్ లాబ్స్ పేరుతో శిశువుల చర్మ సంరక్షణపై మెగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఇంటరాక్టివ్ కార్యక్రమంలో నగరానికి చెందిన మాతృమూర్తులు, నిపుణులు, వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. శిశువుల చర్మానికి సంబంధించిన శాస్త్రీయత, అలాగే మొదటి రోజు నుంచే శిశువుల చర్మ సంరక్షణలో సహాయపడే జాన్సన్స్ బేబీస్ వినూత్న ఫార్ములేషన్స్ గురించి అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మాతృ మూర్తులు పాల్గొన్నారు. జాన్సన్స్ బేబీస్ ఫార్ములాలకు మూలస్తంభాలైన దశాబ్దాల సైన్స్ మరియు పరిశోధనల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కన్సల్టెంట్ పీడియాట్రీషియన్ నియోనే టాలజిస్ట్ డాక్టర్ సగుల్ రామానుజ ముగునాథన్, బసవేశ్వర్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ శాలిని తదితరులు పాల్గొన్నారు

పీ4 సర్వే ప్రగతిపై క్షేత్రస్థాయి పరిశీలన

విశాలాంధ్ర - అనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి గ్రామంలో మండల ఎంపీడీవో పి. జానకి బుధవారం పి 4 సర్వే సర్వేపై క్షేత్ర సాయి పరిశీలన చేశారు. గ్రామాల్లో సర్వే వేగవంతం చేయాలని సేకరించిన డేటాను ప్రతిరోజు సాయంత్రానికి రిపోర్ట్ చేయాలని, ప్రతి ఒక్కరు డేటాను క్షుణ్ణంగా పరిశీలించాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పీడీ హౌసింగ్ సత్తిబాబు, ఈవోపీఆర్డి సత్యనారాయణ, కార్యదర్శి శ్రీరామ్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్లు ధరించి ప్రయాణించాలి

విశాలాంధ్ర - కవిటి : ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెటు ధరించాలని ఎన్హెచ్ఎఐ పీడీ దర్శి ప్రకాష్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా బుధవారం కరపాడు టోల్ ప్లాజ్ వద్ద వాహనదారులకు రోడ్డు భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇందదులో భాగంగా అందరికీ ఉచితంగా హెల్మెటులు అందజేశారు. ఇందులో భాగంగా ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించి మహిళా ఉద్యో గులను సత్కరించి బహుమతులు అందజే శారు.అలాగే క్రికెటు పోటీలు నిర్వహించారు. ఇందులో వివిధ జట్లు పాల్గొనగా టీబిర్ ఇన్ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ జట్టు విజేతగాను, సేఫ్వే కెన్సేసన్ జట్టు రన్నరుగా నిలిచాయి. వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్య క్రమంలో ఆర్ఈ సాహూ, ప్రాజెక్టు మేనేజర్ సెంథిల్ కుమార్, వివీకేవీ ప్రసాద్, టోల్ ప్లాజ్ మేనేజర్ అనీష్ జాన్, కొప్పల రవి, కిరణ్ కుమార్, బి.చిన్ని, రమేష్ బాబు, టోల్ ప్లాజ్ సిబ్బంది, ఐఎం సిబ్బంది పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌లో గ్లకోమా వారోత్సవాలు

విశాలాంధ్ర - పెందుర్తి : ఉత్తరాంధ్ర ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు అందిస్తున్న శంకర్ ఫౌండేషన్ లో మార్చి 9 నుండి 15 వరకు గ్లకోమా వారోత్సవాలు నిర్వహించినట్లు ఆ సమస్త డీజీఎం (పిఆర్) కె.బంగార్రాజు తెలియజేశారు, గ్లాకోమా కారణాలు, నివా రణ ప్రభావంపై దృష్టి సారించి ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. వారం రోజుల పాటు జరిగే ఈ వేడుకలో భాగంగా, నాయుడుతోటలోని ప్రధాన ఆసుపత్రి నుండి వేపగుంట జంక్షన్ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించి, కరపత్రాలు ప్రదర్శించి గ్లకోమా గురించి ప్రజలకు అవగాహన కల్పించినట్లు డిజిఎం చెప్పారు. ఈ ర్యాలీకి రీసెర్చ్ డైరెక్టర్ శంకర్ ఫౌండేషన్ గ్లకోమా విభాగం అధిపతి డాక్టర్ టి. రవీంద్ర నాయకత్వం వహించగా ఆసుపత్రి వైద్యులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీంద్ర మాట్లాడుతూ, "దృష్టి యొక్క నిశ్శబ్ద దొంగ" అని పిలువబడే గ్లకోమా అనేది కంటి వ్యాధుల సమూహాన్ని కలిగి ఉంటుందని స్పష్టం చేశారు. ఇది ఆప్టిక్ నాడిని తిరిగి పొందలేని విధంగా దెబ్బతీస్తుందని, దృష్టి కోల్పోవడానికి తీవ్రమైన సందర్భాల్లో అంధత్వానికి దారితీస్తుందని తెలిపారు. గ్లకోమాను సమర్థవంతంగా నిర్వహించడంలో ముందస్తుగా గుర్తించడం కీలక పాత్ర పోషిస్తుందని డాక్టర్ రవీంద్ర అన్నారు. రోగ నిర్ధారణ సాంకేతికతలలో పురోగతి గ్లకోమా గుర్తింపు యొక్క ఖచ్చితత్వం విశ్వసనీయతను బాగా పెంచిందని, సకాలంలో జోక్యం చేసుకోవడానికి మెరుగైన ఫలితాలను సాధించడానికి వీలు కల్పిస్తుందని ఆయన తెలియచేసారు.

శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి మైక్రోస్కోప్ బహుకరణ

విశాలాంధ్ర - పెందుర్తి : పేద ప్రజలకు నేత్ర వైద్య సేవలు అందిస్తున్న జీవీఎంసీ 93 వ వార్డు నాయుడు తోట సమీపంలో గల శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్ కు మైక్రో స్కోప్ ను, సౌత్ ఆసియా ఎల్పిజి కంపెనీ బుధవారం బహూకరించింది. కంపెనీ తమ సామాజిక బాధ్యత కార్యక్రంలో భాగంగా శంకర్ ఫౌండేషన్‌కు అత్యాధునికమైన మైక్రోస్కోప్, గడప గడపకు ఉచిత కంటి పరీక్ష ప్రాజెక్ట్‌కు 60 లక్షల రూపాయలు విరాళం ప్రకటించారని శంకర్ ఫౌండేషన్ డిజిఎం కె.బంగారురాజు తెలిపారు. ఆసుపత్రిలో జరిగిన ఒక కార్యక్రమంలో సౌత్ ఆసియ ఎల్పిజి కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నవీన్ మఖిఝా మైక్రోస్కోపును ప్రారంభించారు. కంటి వ్యాధి నిర్మూలనలో సమాజానికి శంకర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ సౌత్ ఆసియా ఎల్పిజి కంపెనీ శంకర్ ఫౌండేషన్‌కు అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తుందని మఖిజ పేర్కొన్నారు. శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణ కుమార్ సౌత్ ఆసియ ఎల్పిజి కంపెనీ ఆసుపత్రికి అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఆసియా ఎల్పిజి కంపెనీ సి ఎఫ్ఓ వికాస్ వర్మ, రాంనాథ్, మేనేజర్, శంకర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కే రాధాకృష్ణన్, డిప్యూటీ జనరల్ మేనేజర్లు రమేష్ కుమార్, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - పద్మనాభం : పద్మనాభం మండలం వైఎస్ఆర్సిపి మండల కార్యాలయం వద్ద బుధవారం వైఎస్ఆర్సిపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, స్థానిక ఎంపీపీ రాంబాబు, జడ్పీ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు ఆధ్వర్యంలో ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ స్థాపించి సుమారు 15 సంవత్సరాలు అవుతున్నప్పటికీ వైఎస్ఆర్సిపి పార్టీ అధికార పక్షంలో అయినా ప్రతిపక్షంలోని అయినా ప్రజల కోసం పోరాటం చేసి, పేదవాడి పక్షాన పోరాటం చేసి ప్రతి పేదవాడి గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచిపోయిందని వారు అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదవాడి పరిస్థితి మరింత దయనీస్థితిలోకి మారిపోయిందని వారన్నారు. మరల వైఎస్ఆర్సిపి అధికారంలోకి వచ్చాక ప్రతి పేదవాడికి మేలు జరుగుతుందని అన్నారు. ప్రతి కార్యకర్తకు మన నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను మనకు అన్నివేళలా అందుబాటులో ఉండే వ్యక్తిని కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా ఆదుకునే మనిషిని, మన నాయకుడు జగన్మోహన్ రెడ్డి కులం చూడం, మాత్రం చూడం ప్రాంతం చూడం పార్టీ చూడమని అందరికీ మేలు చేసిన వ్యక్తిని మరల మన పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఓ పేదవాడికి మేలు జరుగుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్ఆర్సిపి పార్టీ శ్రేణులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - పొందూరు : మండల కేంద్రం పొందూరులో అంబేద్కర్ జంక్షన్ సమీపంలో ఉన్న రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి, అలాగే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కు పూలమాలలు వేసి హెరారెత్తిన నినాదాలు మధ్య వైసిపి 15వ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ ఉత్సవాలు సందర్భంగా మండల వైసీపీ పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, జడ్పిటిసి సభ్యులు లోలుగు కాంతారావులు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం అధికార పార్టీ అవలంబిస్తున్న నిర్లక్ష్య నిరంకుశ వైఖరి పట్ల ధ్వజమెత్తుతూ నినాదాలు హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కళింగ సామాజిక వర్గ అధ్యక్షులు దుంపల రామారావు, పట్టణ పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు, వైసీపీ ఎంపీటీసీ వడగ పద్మ, ఎంపీటీసీ ప్రతినిధి వడగ మోహన్, కూన రవణమ్మ హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ మెంబర్ అల్లంశెట్టి గిరిబాబు, పెనుబర్తి సర్పంచ్ ప్రతినిధి తమ్మినేని మురళీకృష్ణ, పైడి నాగభూషణరావు, బొడ్డేపల్లి సర్పంచ్ ప్రతినిధి బొడ్డేపల్లి రమణారావు, కొంచాడ సర్పంచ్ ప్రతినిధి పేయ్యల తవిటి నాయుడు, గురుగుపల్లి శేఖర్, మండల నలుమూలల నుండి కదిలి వచ్చిన సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.